క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత జగ్గంపేట


క్రికెట్ టోర్నీ విజేతకు ట్రోఫీ, నగదు అందజేస్తున్న ఇజ్రాయేలు

రంగంపేట: వడిశలేరులో జరిగిన బుల్లిదొర, రవికుమార్ మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో జగ్గంపేట టీమ్ విన్నర్‌గాను, వడిశలేరు టీమ్ రన్నర్ గాను నిలిచాయి. ఏప్రిల్ 6వ తేదీన ప్రారంభమైన ఈ టోర్నీలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 42 టీమ్‌లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో వడిశలేరు, జగ్గంపేట టీమ్‌లు తలపడగా మొదటి బ్యాటింగ్ చేసిన వడిశలేరు టీమ్ 12 ఓవర్లలో 114 పరుగులు చేయగా జగ్గంపేట టీమ్ లక్ష్యాన్ని ఛేదించి విన్నర్‌గా నిలిచింది. ఈ టోర్నమెంట్‌కు స్పాన్సర్స్‌గా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, నేతిపూడి ఎస్తేర్‌రాణి, కొండేపూడి జాన్‌బాబు, వర్ధనపు ప్రభాకరరావు వ్యవహరించారు. విన్నర్ టీమ్‌కు కొల్లాటి ఇజ్రాయేలు ట్రోఫీ, రూ.22,222 నగదు అందజేయగా, రన్నర్ టీమ్‌కు ఎస్తేర్ రాణి షీల్డ్, రూ.11,111 నగదు, తృతీయ స్థానం సాధించిన చంద్రేడు టీమ్‌కు జాన్‌బాబు, ప్రభాకర్‌రావు షీల్డ్,రూ.5,555 నగదు బహుమతులను అందజేశారు. టోర్నీ విజయవంతానికి కృషి చేసిన స్థానిక యూత్ సభ్యులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు అభినందించారు.

ఎస్టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా ఉందుర్తి


ఉందుర్తి సుబ్బారావును అభినందిస్తున్న సాయిశ్రీనివాస్ తదితరులు

రాజానగరం: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఉందుర్తి సుబ్బారావును నియమించినట్టుగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయిశ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డేనియల్ బాబు, లక్ష్మణ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నియామకం జరిగిందన్నారు. రెండున్నర దశాబ్దాలుగా ఎస్టీయూలో క్రియాశీలక కార్యకర్తగా సేవలందిస్తున్న సుబ్బారావు ప్రస్తుతం లాలాచెరువు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు.

అభివృద్ధికి చిరునామా రాజానగరం


బుద్దిగ సత్తిబాబు

మధురపూడి: అభివృద్ధికి చిరునామాగా రాజానగరం నియోజకవర్గం నిలిచిందని, సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, ఆర్‌బీకేల నిర్మించి, రాష్ట్రంలో పులివెందుల తర్వాత స్థానంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిలిపారని బూరుగుపూడి పీఏసీఎస్ చైర్ పర్సన్, గౌడ సంఘం సలహాదారుడు బుద్దిగ సత్తిబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. గౌడ, శెట్టిబలిజ తదితర వెనుకబడిన తరగతులకు ఎన్నో అవకాశాలు కల్పించిన ఘనత రాజాకు దక్కుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను మరోసారి గెలిపించుకోవాలని ప్రజలను కోరారు.

రవాణా కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ: మోటారు రవాణా కార్మికుల సంక్షేమానికి రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని రవాణా కార్మికుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చకర్ల సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాల తర్వాత అనేక మంది రవాణా రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. డ్రైవర్లు, మెకానిక్‌లు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, టైర్లు ఫిటింగ్ చేసేవారు, పెట్రోల్ బంకులో పనిచేసేవారు, ఆటోమొబైల్లో పనిచేసేవారు, లారీ క్లీనర్లను రవాణా రంగ కార్మికులుగా గుర్తించాలన్నారు. టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో జేఏసీ కమిటీ రాష్ట్ర కార్యదర్శి పి.ఆదినారాయణ, లారీ యూనియన్ అధ్యక్షుడు కొత్తపల్లి వీరభద్రరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నార్గన వసంత కుమార్, కోశాధికారి వెన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే జగన్ అజెండా


బాలవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


పెద్దాడలో ఎన్నికల ప్రచారంలో ఫ్యానుగుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బాలవరంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం

రంగంపేట: సంక్షేమం, అభివృద్ధే అజెండాగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించి గెలిపించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కోరారు. మండల పరిధిలోని బాలవరం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు బాలవరం వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, పూల జల్లులు, మంగళ హారతులతో సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, పార్టీ మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవి శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందాం : ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్ర సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెద్దాడ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు ప్రజలు అడుగడుగున పూలమాలలు వేసి, శాలువకప్పి, పూల వర్షం కురిపించి, హారతిలిచ్చి, బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి చూసి ప్రజలందరు ఫ్యానుగుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడురు శ్రీనివాసును భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచి డొకుబుర్ర మీనాక్షి, ఎంపీటీసీ సభ్యురాలు వై.మాధవీలత, పార్టీ గ్రామ కన్వీనర్ పాలచర్ల రామకృష్ణ చౌదరి, యారమాటి ప్రకాశ్, వాశంశెట్టి అప్పారావు, ముత్యాల నారాయణరావు, డొకుబుర్ర కృష్ణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరివాసు, హితకారిణ సమాజం డైరెక్టర్ వుంద్రు సత్యనారాయణ, రాష్ట్ర చేనేతవిభాగం కార్యదర్శి పప్పు సింహాచలం, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం


మునగాలలో ఎమ్మెల్యే రాజాను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

- ప్రజాసంక్షేమానికి జగనన్న పెద్ద పీట
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాజా

మధురపూడి: రైతన్నను రాజుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతోనే జగనన్న పాలన సాగుతోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన సోమవారం కోరుకొండ మండలం మునగాల, శ్రీరంగపట్నం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మునగాలలో గ్రామదేవతను దర్శించుకున్న అనంతరం ఆయన వాహనంలో ప్రచారాన్ని సాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతన్నలపై అప్పుల భారం మోపగా, జగనన్న ప్రభుత్వం రైతుకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సాగుకు అవసరమైన సలహాలు, సేవలు అందిస్తున్నారన్నారు. పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంతో పాటు పంటను నిల్వ చేసుకునేందుకు గిడ్డంగుల నిర్మాణం చేసినట్టు తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరవుతున్నారన్నారు.

ఫ్యాను గుర్తుకు ఓటు.. సంక్షేమానికి చోటు


కుతుకులూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సత్తి ఆదిలక్ష్మి

ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: శాసనసభ ఎన్నికల గడువు దగ్గర పడుతుండడంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లకు అండగా నిలవాలని కోరుతూ ఎమ్మెల్యే సతీమణి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి సోమవారం మండలంలోని కుతుకులూరులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సత్తి గీతావర లక్ష్మి వెంకటరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, పెడపర్తి, కుతుకులూరు, అనపర్తి సర్పంచ్‌లు నల్లమిల్లి కాంతమ్మ, గొల్లు హేమతులసిసురేష్, వారా కుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవ రెడ్డి, ఎంపీటీసీలు తుమ్మా రాజేశ్వరి, బండారు శ్రీను, సత్తి దొరయ్యరెడ్డి, కొండేటి భీమేష్, పార్టీ నాయకులు ఎస్ఎస్, పడాల వెంకటరెడ్డి, కోనాల సత్యనారాయణ రెడ్డి, మల్లిడి గోవిందరెడ్డి, నూనె రంగారావు, ర్యాలి కృష్ణ, టైలర్ కృష్ణ, విజయకుమారి పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా అనపర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ వారా కుమారి, ఎంపీటీసీలు

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించండి

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల విధులు సక్రమంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలని అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. సోమవారం అనపర్తి వచ్చిన ఆయన స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, పాఠశాల పరిసరాలు, లాక్‌బుక్‌లను పరిశీలించి ఈవీఎంల భద్రత, పోలింగ్ కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సిబ్బంది, అధికారులు కృషి చేయాలన్నారు. స్ట్రాంగ్ రూం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలు, సెక్యూరిటీ సిబ్బంది ఎంతమంది ఉన్నారు సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అనపర్తి కెనాల్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. అంతకుముందుగా మండలంలోని కొప్పవరంలోని 24, 25 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పడ్డ సమస్యలపై సిబ్బందిని ఆరా తీసి వీఆర్వోలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ జరిగే ముందు రోజు ఎన్నికల సామగ్రి పంపిణీని త్వరితగతిన పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాట్లపై ఆర్‌ఓ ఎం.మాధురితో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ, తహసీల్దార్ కె.సునీల్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్నికల ఏర్పాట్లపై ఆర్‌ఓ మాధురితో చర్చిస్తున్న నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బాలసుబ్రహ్మణ్యం

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వీరే

అనపర్తి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అనపర్తి నియోజకవర్గం నుంచి 9 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీతో ముగిసింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసే నాటికి 24 మంది అభ్యర్థులు 27 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. కాగా ఈ నెల 26న నామినేషన్లను పరిశీలించిన అధికారులు పదిహేను నామినేషన్లను తిరస్కరించారు. 9 మంది అభ్యర్థుల నామినేషన్లు సరైనవిగా ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు సోమవారం ఎవరూ కూడా నామినేషన్ల ఉపసంహరణ చేయకపోవడంతో బరిలో 9 మంది ఉన్నట్టు ఆర్‌ఓ ఎం.మాధురి తెలిపారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ఫ్యాన్ (వైఎస్సార్ సీపీ) నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి కమలం (బీజేపీ), ఎల్లా శ్రీనివాసరావుకు హస్తం (కాంగ్రెస్) గుర్తులు కేటాయించారు

'రాజానగరం' బరిలో 12 మంది అభ్యర్థులు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్లు వేసిన 14 మందిలో ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 12 మంది పోటీలో మిగిలారు. తొలుత 18 మంది నామినేషన్లు వేయగా పరిశీలనలో నాలుగింటిని తిరస్కరించారు. మిగిలిన 14 మందిలో స్వతంత్ర అభ్యర్థులు బత్తుల బాలబ్రహ్మం, బత్తుల వెంకటలక్ష్మి సోమవారం తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మిగిలిన 12 మందికి రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి గుర్తులను కేటాయించారు. జక్కంపూడి రాజాకు సీలింగ్ ఫ్యాన్ (వైఎస్సార్ సీపీ), ముంద్రు వెంకట శ్రీనివాస్‌కు హస్తం (కాంగ్రెస్) కేటాయించారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: ఉరివేసుకుని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొమ్మూరు గ్రామపంచాయతీ వీధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన సీహెచ్ స్వర్ణ (25) బొమ్మూరులోని బేయర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ బొమ్మూరు పంచాయతీ వీధిలోని అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటోంది. ఆమెతో పనిచేసే ఉద్యోగిని సోమవారం రాత్రి స్వర్ణ ఉంటున్న ఫ్లాట్‌కు వచ్చి చూడగా, చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయి ఉంది. ఈ విషయాన్ని బొమ్మూరు పోలీసులకు తెలపగా, ఎస్సై అంకారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్వర్ణ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తల్లిదండ్రులు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పార్టీలో భారీ చేరికలు


పుట్టకొండలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పుట్టకొండ గ్రామంలో ఆదివారం రాత్రి టీడీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో భారీ సంఖ్యలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ ఉప సర్పంచి మిరియాల శ్రీను, సూరంపూడి శేఖర్, విత్తనాల ఈశ్వరరావు, కట్టా నాగేశ్వరరావు, దెయ్యాల శివ, గెద్దాడ లోవరాజు, కేతా గోవిందు, కేతా సత్తిబాబు, బూరా సూర్యచంద్ర, బొడ్డపాటి అచ్చరావు, పెంకే నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీలో చేరారు.. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, బీసీలు, ఎస్సీలకు ఇస్తున్న ప్రాధాన్యతతో పార్టీలో చేరామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమరోత్సాహంతో ముందుకు దూసుకుపోవాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి సుముఖత స్థానం కల్పిస్తారన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోడానికి అందరు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకు ప్రజల నుంచి ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రజలందరూ సీఎం జగన్‌కు సీఎం పదవి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, సర్పంచి వల్లు వెంకటరమణ, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, పార్టీ నాయకులు తాడల మణికంత, మేడిశెట్టి సత్తిబాబు,మండ రాజారెడ్డి, కుడిపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే కావాలి – మన రాజా రావాలి


పాతూరులో డాక్టర్ రాజశ్రీని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

- ఎమ్మెల్యే రాజా భార్య డాక్టర్ రాజశ్రీ
- బూరుగుపూడిలో ఎన్నికల ప్రచారం

మధురపూడి: మళ్లీ జగనే కావాలి - మన జక్కంపూడే రావాలని వైఎస్సార్ సీపీ నాయకురాలు, ఎమ్మెల్యే రాజా భార్య డాక్టర్ రాజశ్రీ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలని కోరారు. తొలుత గ్రామ దేవత పాశాలమ్మను దర్శించుకున్న అనంతరం పాతూరు రామకోవెల, శివాలయం, హైస్కూల్ ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లను కలిశారు. డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. తొలుత పాతూరులో పర్యటించిన రాజశ్రీ, మెయిన్ రోడ్డు మీదుగా సాయిబాబు గుడి, చర్చి, అంబేద్కర్ విగ్రహం పరిసర ప్రాంతాల్లో ప్రచారం సాగించారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ, సమస్యలను పరిష్కరిస్తున్న జక్కంపూడి కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. తమ కుటుంబంలోని అందరం ప్రజలకు సేవలందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. పాతూరు రామాలయం వద్ద జక్కంపూడి రాజశ్రీని గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత తిరుమలశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి కోరుకొండ మండలం చైర్మన్ క్రొవ్విడి సర్రాజు, సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ, మాజీ సర్పంచ్ కంటే వీర వెంకట సత్యనారాయణ, బూరుగుపూడి పీఏసీఎస్ చైర్ పర్సన్ బుద్దిగ సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టా కృష్ణ, పార్టీ నాయకులు మేకా రాజు పాల్గొన్నారు.

కలసికట్టుగా బీసీల ఐక్యత చాటుదాం

రాజమహేంద్రవరం సిటీ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో బీసీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి, బీసీల సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందని శెట్టిబలిజ, గౌడ సామాజిక వర్గ నాయకులు పిలుపు నిచ్చారు. నగరంలోని లాలా చెరువు హోండా షోరూమ్ సమీపంలో సోమవారం శెట్టిబలిజ గౌడ ఆత్మీయ కలయిక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరయ్యారు. బీసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో బీసీలకు గుర్తింపు వచ్చిందన్నారు. సమాజంలో గౌరవం, రాజకీయంగా ప్రోత్సాహం, ఆర్థికంగా సహకారం ఇస్తూ భుజం తట్టి ప్రోత్సహిస్తున్న జగనన్న వెంటే బీసీ సామాజిక వర్గీయులందరూ ఉండాలని పిలుపు నిచ్చారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీలందరిపైనా ఉందన్నారు.

పెద్ద కొడుకుగా సేవలందిస్తా : భరత్‌రామ్

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ సిటీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ ఇంటి పెద్ద కొడుకునై సేవలందిస్తానన్నారు. ఎంపీగా నగరానికి చేసిన అభివృద్ధిని వివరించారు. పార్లమెంట్, సిటీ, రూరల్ నియోజకవర్గాలలో బీసీ అభ్యర్థులను ఎన్నికల బరిలో జగనన్న నిలబెట్టారంటే, మన ఐక్యతపై ఆయనకు ఉన్న నమ్మకమన్నారు. దానిని వమ్ము చేయకుండా ముగ్గురినీ గెలిపించాలన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టానన్నారు. వైఎస్సార్ ఆశయాలు, జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలకు తగ్గట్టుగా ప్రజాసేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు మాజీ కార్పొరేటర్లు గుత్తుల మురళీధర్, మార్గాని నాగేశ్వరరావు, వాసంశెట్టి గంగాధర్, పాలిక శ్రీనివాస్, కడలి వెంకటేశ్వరరావు, గుత్తుల వీరబ్రహ్మం, గూడూరి రాధిక పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాలో పింఛన్ నగదు

బిక్కవోలు : పింఛను నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని 10,838 పింఛనుదారులు ఉండగా అందులో 2,980 మంది ఇంటింటికీ వెళ్లి పింఛను ఇవ్వనున్నారు. మిగిలిన వారికి నేరుగా వారి ఆధార్ కార్డు లింక్ అయిన ఖాతాలో జమ అవుతుందన్నారు. లబ్ధిదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది లబ్ధిదారులు తెలియజేయాలన్నారు.

బ్యాంకు ఖాతాలకే పింఛన్ల జమ

మధురపూడి: వైఎస్సార్ సామాజిక భద్రత పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మార్పులు చేసినట్టు కోరుకొండ ఎంపీడీఓ హేమసుందరరావు తెలిపారు. మే ఒకటో తేదీ బుధవారం దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు మాత్రమే ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తామని, మిగిలిన లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతుందన్నారు. బ్యాంకుఖాతాకు ఎన్‌పీసీఎల్ లింక్ లేని వారికి మే రెండో తేదీ అందజేస్తామని వివరించారు. మండలంలోని 12,549 పింఛను లబ్ధిదారులకు ప్రతినెలా రూ.3,75,41,000 పంపిణీ చేస్తున్నట్టు విషయం తెలిసిందే.

తాటాకిల్లు దగ్ధం


చినకొండేపూడిలో కాలిపోయిన ఇల్లు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి ఎస్సీ కొత్తపేటలో చిడిపి మురళీకి చెందిన తాటాకిల్లు సోమవారం మధ్యాహ్నం దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ఒక్కసారిగా మంటలు రేగడంతో స్థానికులు అక్కడకు చేరుకుని అదుపు చేశారు. ప్రమాదంలో ఇంటిలోని వంట సామగ్రి, ఫ్యాన్, టీవీ, మంచాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న వీఆర్వో రమేష్ బాధితులకు తక్షణ సహాయంగా 20 కిలోల బియ్యం అందించారు. రూ.లక్ష ఆస్తినష్టం జరిగిందని భావిస్తున్నారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

కంబాలచెరువు: ఇంటర్మీడియేట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాని, ఉత్తీర్ణత చెందని విద్యార్థులకు బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నర్సింహం తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జనరల్, ఒకేషనల్ విద్యార్థులందరూ ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకావాలన్నారు. మే నాలుగో తేదీ వరకూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.